## క్లుప్తంగా

### 23 నుంచి ఓఎన్‌జీసీ పరిహార దరఖాస్తుల పరిశీలన

యానాం: సముద్రంలో ఓఎన్‌జీసీ నూతనంగా గ్యాస్ పైపులైను వేస్తున్న నేపథ్యంలో చేపల వేటపై ఆధారపడి నష్టపోతున్న స్థానిక మత్స్యకారులకు ఇచ్చే పరిహారానికి పెట్టుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా ఈ నెల 23 నుంచి పరిశీలిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య గురువారం ప్రకటనలో తెలిపారు. 23 నుంచి 25 వరకు కనకాలపేట, 27నుంచి 31 వరకు అగ్రహారం, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు కొత్తపేట, 6 నుంచి 8 వరకు ఫ్రాన్స్‌తిప్ప, 9 నుంచి11 వరకు ఓల్డ్ రాజీవ్ నగర్, 13 నుంచి 16 వరకు కురసాంపేట, 17 నుంచి 22 వరకు మెట్టకూరు, 23 నుంచి 25 వరకు అయ్యన్ననగర్, 27 నుంచి 28 వరకు దరియాలతిప్ప, మార్చి 1నుంచి 6 వరకు గిరియాంపేట, 9 నుంచి 14 వరకు సావిత్రినగర్‌ల్లో అధికారులు వచ్చి పరిశీలిస్తారని కాబట్టి ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్, సొసైటీ సభ్యత్వం నంబరు స్లిప్ సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.

### హైమాస్ట్ లైట్లు బాగుచేయరూ..

యానాం: పట్టణ పరిధిలోని పాతబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటుచేసిన విద్యుత్ హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చేయాలని కోరుతూ యానాం ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పండు సిద్ధార్థకుమార్ ఆధ్వర్యంలో ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్‌లైట్ల నిర్వహణను సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### మాజీ స్పీకర్ కామిశెట్టికి నివాళులు



కామిశెట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మునిస్వామి

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ మాజీ స్పీకర్ కామిశెట్టి వరప్రసాదరావునాయుడు వర్ధంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక మినిసివిల్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు నివాళులర్పించారు. సీఐ గూటం శివగణేష్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పీఆర్‌ఏఓ కొల్లు ప్రసాద్, న్యాయవాది కమిడి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి : ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం: మండలం గేదిల్లంకలో బుధవారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేదెల్లంక కొబ్బరి తోటల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారం మేరకు ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

### నేత్రదానం



పద్మావతి (ఫైల్)

యానాం: పట్టణానికి చెందిన బెజవాడ పద్మావతి(60) గురువారం మృతి చెందారు. లయన్స్ క్లబ్‌కు ప్రతినిధి ధూళిపూడి వెంకటరమణ(బాబి) మృతిరాలి భర్త రామకృష్ణతో సంప్రదించి పద్మావతి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు అందజేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది నానాజీ, వెంకట్ కార్నియాలను సేకరించారు.

### జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి అధ్యక్షతన జిల్లా పార్టీ సమావేశం గురువారం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ముషిణి రామకృష్ణారావు, దోనిపాటి విజయలక్ష్మి, మాచవరపు శ్రీమన్నారాయణ, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

### సాయిబాబా ట్రస్ట్ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు, జనసేన నాయకుడు దివంగత పిండి సాయిబాబా 60వ జయంతి సందర్భంగా ఆయన పేరు మీద చారిటబుల్ ట్రస్ట్‌ను కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు గురువారం ప్రారంభించారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఈ ట్రస్ట్‌ను దివంగత సాయిబాబా కుమారుడు పిండి రాజా నెలకొల్పారు. ట్రస్ట్ సేవల్లో భాగంగా తొలుత ప్రెస్ క్లబ్ భవనంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక గడియారం స్తంభం సెంటరులో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వేటలో వివాదాలు వద్దు

- కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ
- గాడిమొగ, హోప్ ఐలాండ్ మత్స్యకారులతో సమావేశం
- జీవన భృతికి పరస్పరం సహకరించుకోవాలని పిలుపు





మత్స్యకారులతో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ

తాళ్లరేవు: మత్స్యకారులందరూ ఎటువంటి వివాదాలు లేకుండా సామరస్యంగా వేట సాగించాలని కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ కోరారు. గాడిమొగ, హోప్ ఐలాండ్ మత్స్యకారుల మధ్య వేటకు సంబంధించి నెలకొన్న సరిహద్దు వివాదానికి సంబంధించి ఇటీవల హోప్ ఐలాండ్ మత్స్యకారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశపు హాలులో ఇరు ప్రాంత మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్డీఓ రమణ హాజరై మాట్లాడుతూ మత్స్యకారులు తమ జీవన భృతి నిమిత్తం ప్రధానంగా చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఆంక్షలు లేకుండా వేట సాగించాలని కోరారు. దీనికి సంఘ పెద్దలందరూ కృషి చేయాలని కోరారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని, సంఘ కట్టుబాట్ల ప్రకారం వేట సాగించాలని కోరారు. ఈ సమావేశంలో ఫిషరీస్ ఏడీ కె.కరుణాకరరావు, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్, ఎఫ్‌డీఓ గోపి తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



దేవగుప్తం హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో బండారులంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

అల్లవరం: దేవగుప్తం ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయంగా సమావేశమయ్యారు. చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం ఎం.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను పంచుకున్నారు. వారంతా పాఠశాల అవసరాల కోసం రూ.20 వేలు విలువ చేసే ఇన్వెర్టర్‌ను హెచ్‌ఎం వెంకటరమణకు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు వెంకటరమణ, అప్పారి త్రిమూర్తులు, అప్పారి శ్రీనులకు సన్మానం చేశారు. జాలెం రాంబాబు, పరసా వెంకట కృష్ణారావు, చోడే విజయదుర్గ, చెదళ్ల కృష్ణవేణి, చేట్ల ఉమా, బైరిశెట్టి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**స్నేహితుని కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం**

తాళ్లరేవు: వారంతా 1987–88 సంవత్సరంలో పదో తరగతి కలిసి చదువుకున్నారు. తరువాత వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఆ బ్యాచ్‌కు చెందిన పలువురు డైమండ్ గ్రూప్‌గా ఏర్పడి పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తమతోపాటు కలిసి చదువుకున్న స్నేహితుని కుమార్తె వివాహానికి వారంతా మళ్లీ కలుసుకున్నారు. పి.మల్లవరం డీజీబీ కల్యాణ మండపంలో గురువారం జరిగిన కపిలేశ్వరపు శ్రీనివాస్ కుమార్తె దివ్య ప్రసన్న వివాహానికి మిత్రులందరూ హాజరై రూ.51,116 అందజేశారు.

**బండారులంకలో..**

అమలాపురం రూరల్: బండారులంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. వారికి విద్య నేర్పిన గురువులను సత్కరించి, ఆశీర్వాదం పొందారు. తమ పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకొని అందరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎంఎస్ఎన్ మాస్టర్ గంగా భవాని, పుత్సా సీతా మహాలక్ష్మి తదితరుల నుంచి విద్యార్థులు ఆశీర్వాదం తీసుకున్నారు.

# వేమన సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయకం



యోగి వేమనకు నివాళులర్పిస్తున్న కోనసీమ రెడ్డీస్ అసోసియేషన్ ప్రతినిధులు, సాహితీప్రియులు



తాళ్లరేవులో వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ సునీత, ఎంపీడీఓ అనుపమ



భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

- కవి డాక్టర్ పైడిపాల

అమలాపురం టౌన్: యోగి వేమన సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయమని కవి, తెలుగు సినీ గేయ పరిశోధకుడు డాక్టర్ పైడిపాల పేర్కొన్నారు. కోనసీమ రెడ్డీస్ అసోసియేషన్, సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని వేమన కమ్యూనిటీ హాలులో గురువారం జరిగిన యోగి వేమన జయంతి సభలో డాక్టర్ పైడిపాల ప్రసంగించారు. కోనసీమ రెడ్డీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తేతలి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 19న యోగి వేమన జయంతి జరపుకోవాలని అధికారికంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. వేమనపై గౌరవాన్ని ప్రకటించిన ప్రభుత్వానికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం వేమన పేరుతో పురస్కారాలు ఇవ్వాలని ప్రభుత్వానికి సభ విజ్ఞప్తి చేసింది. తొలుత వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాహిత్యాభిమానులు, యోగి వేమన పద్యాల అభిమానులు పాల్గొన్నారు.

**తాళ్లరేవులో..**

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ నివాళులు అర్పించారు. ఎంపీపీ కార్యాలయ పరిపాలనాధికారి చింతా మోహనకృష్ణ, ఈఓ పీఆర్‌డీ వీజేవీ రమణ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తంలో..**

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సత్తి సత్యకృష్ణ ఆధ్వర్యంలో వేమన జయంతి నిర్వహించి నివాళులర్పించారు. విద్యార్థులకు వేమన ఖ్యాతిని వివరించారు. ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు, పీడీ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు ఇబ్బంది లేకుండా చర్యలు

- రెండు నెలల పాటు తుఫాన్ పునరావాస కేంద్రంలో విద్యా బోధన
- ఎంపీపీ శేషగిరిరావు

సాక్షి ఇంపాక్ట్



ఎస్.రామేశ్వరంలోని యూపీ పాఠశాలను సందర్శించిన ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా కొత్త తుఫాన్ పునరావాస కేంద్రంలో విద్యా బోధన చేసేందుకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీఓ సరోవరరావు కలసి ఎస్.రామేశ్వరంలోని ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. పాఠశాలను అనుకుని శిథిలావస్థకు చేరిన భవనం తొలగింపు పనులు ఇటీవల చేపట్టారు. దీనిపై 'విద్యార్థుల భద్రత మరచి' కథనాన్ని సాక్షి ప్రచురించింది. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. పాడుబడిన భవనం శిథిలాలు తొలగింపుతో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు రెండు నెలలు పాటు కొత్తగా నిర్మించిన తుఫాన్ పునరావాస కేంద్రంలో విద్యా బోధన జరిపించేందుకు నిర్ణయం తీసుకున్నామని ఎంపీపీ తెలిపారు. శిథిలాలు తొలగించి నూతన భవనం నిర్మించే వరకు విద్యా బోధన జరుగుతుందని వారు తెలిపారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 23 నుంచి రూ.వెయ్యి సహాయపథకం

యానాం: దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల్లోని మహిళా యజమానికి ప్రతినెలా రూ.వెయ్యి ఆర్థికసాయం అందించే పథకాన్ని జనవరి 23 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. మిగిలిన ఏ సంక్షేమపథకం వర్తించని 21–55 ఏళ్ల వయసు ఉన్న వారికి నెలవారీ సహాయంపై 2022–23 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

### ఘనంగా గ్రామ దేవత జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉప్పలగుప్తం: మండల పరిధి ఎస్.యానంలో గ్రామదేవత కాటుమాయయ్మ జాతర గురువారం నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# జాతీయ యువజనోత్సవాల్లో కైట్ విద్యార్థులు

తాళ్లరేవు: ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న కైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాకీర్‌హుస్సేన్, డానియేల్ బెల్సన్‌లను కళాశాల చైర్మన్ పోతుల వెంకట విశ్వం అభినందించారు. ప్రధాని మోదీ హాజరైన ఈ కార్యక్రమంలో తమ విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమని విశ్వం పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ దూబే రేవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్.ఉమామహేశ్వరి తదితరులు అభినందించారు.

# వైభవంగా లక్ష్మీనృసింహుని శాంతి కల్యాణం



అంతర్వేదిలో స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం అర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ కల్యాణ మంటపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం విష్వక్సేన పూజతో స్వామివారి శాంతి కల్యాణాన్ని ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన అర్చకులు, పండితులు కన్నుల పండువగా ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, భక్తులు పాల్గొన్నారు.

**బారికేడ్లు, గ్యాలరీల ఏర్పాట్ల పరిశీలన**

అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించి భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎస్సై అడపా ఫణిమోహన్ గురువారం పరిశీలించారు. ఆలయం వెలుపల, లోపల భక్తుల క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాట్లను, కల్యాణ వేదికకు చేరి ఇరువైపులా భారీ షెడ్లలో స్వామివారి కల్యాణోత్సవం వీక్షించేందుకు అనువుగా గ్యాలరీల ఏర్పాట్లను వారు పరిశీలించారు. వేదిక వద్ద వీఐపీలు, రాజకీయ ప్రముఖుల గ్యాలరీల ఏర్పాట్లపై కూడా చర్చించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి కూడా పాల్గొన్నారు.

# తాళ్లరేవులో జిల్లా ఎస్పీ పర్యటన

- పరీక్షా కేంద్రం, చెక్‌పోస్టుల పరిశీలన



కైట్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు గురువారం మండలంలో పర్యటించారు. తొలుత ఆయన కైట్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి ఈ నెల 22వ తేదీన పోలీస్ కానిస్టేబుల్స్ ప్రాథమిక రాతపరీక్ష నిర్వహించనున్న దృష్ట్యా స్థానిక పోలీసు అధికారులతో పాటు, పరీక్ష నిర్వహణ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ మద్యం నియంత్రణకు జాతీయ రహదారి 216లోని జైభీమ్‌పేట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. చెక్‌పోస్టు పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరక్కుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే యానాం నుంచి అక్రమ మద్యం, నాటుసారా రవాణా జరక్కుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తదితరులు ఉన్నారు.

# క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులకు టెస్ట్ పేపర్లను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అమలాపురం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని పేరూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.పురుషోత్తం రాజు అన్నారు. జల్లి కుటుంబరావు, సూర్యకుమారి మెమోరియల్ ట్రస్ట్ తరపున యూటీఎఫ్ తయారు చేసిన పదో తరగతి టెస్ట్ పేపర్లను పేరూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. పీఎంసీ కమిటీ చైర్మన్ కడలి భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈతకోటి నాగేశ్వర రావు, దేవరపల్లి వీరేష్‌కుమార్, పల్లి సుబ్బారావు, కాపు సంఘం అధ్యక్షుడు మెయిల సత్యనారాయణ, సీహెచ్ సత్యనారాయణ ట్రస్ట్ కార్యక్రమాలను అభినందించారు. అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, ఎస్‌కేబీఆర్ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి హామీ

అమలాపురం టౌన్: సంక్రాంతి పండుగల్లో కొత్తపేట రామాలయం వద్ద జరుగుతున్న ఆర్కెస్ట్రా చూస్తూ ప్రమాదవశాత్తు అదే ఆలయం భవనంపై నుంచి కిందపడి గాయపడిన చిన్నారి సీహెచ్ సత్యసాగర్ వైద్యానికి శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) తన వంతు సాయం చేసేందుకు ముందుకువచ్చింది. స్థానిక సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాగర్ వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని తెలుసుకున్న సంస్థ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ గురువారం ఆస్పత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి చిన్నారి చికిత్సకు అయ్యే ఖర్చులో తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపేట ఎస్ఏఎఫ్ ద్వారా ఈ సాయం అందజేస్తామన్నారు.

# తుప్పల్లోకి దూసుకుపోయిన కారు



తుప్పల్లోకి వెళ్లి ఆగిన కారు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని యానాం బైపాస్ రహదారిలో గురువారం ఒక కారు పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాకినాడకు చెందిన కొందరు కారులో భీమవరం వెళ్తుండగా స్థానిక నేరెళ్లమ్మ ఆలయం సమీపంలో ఒక్కసారిగా కారు బ్రేక్ స్ట్రక్ అయ్యి అదుపు తప్పడంతో పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### త్వరలో మద్రాసు హైకోర్టు బెంచ్ ఏర్పాటు

యానాం: పుదుచ్చేరికి ప్రత్యేక హైకోర్టులేని నేపథ్యంలో త్వరలో మద్రాసు హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. గురువారం ఆయన పుదుచ్చేరిలో రూ.13 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రంగసామి మాట్లాడుతూ రాష్ట్ర హోదా సాధించేందుకు న్యాయవాదులు ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని కోరారు.

### ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: సంక్రాంతి సంబరాల పేరుతో ముగ్గురు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి వారు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందే పరిస్థితి తీసుకుని వచ్చిన గొల్లవిల్లి విజ్డమ్ పాఠశాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు డిమాండ్ చేశారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పీడీఎస్‌యూ నాయకులు గురువారం పరామర్శించారు.

### ఉపాధి పనుల పరిశీలన



సన్నవిల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివరిస్తున్న పీడీ మధుసూదన్

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో రైతు పొలంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పరిశీలించారు. ఈజీఎస్ డైరెక్టర్ చిన తాతయ్య టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పీడీతో మాట్లాడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పనులకు అనుగుణంగా కూలీల శాతం పెంచాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఏపీడీ బి.చంద్రమోహన్, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఏపీవో వి.రాజామణి, టీఏలు సత్యసూరిబాబు, దేవీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర వస్తువుల పంపిణీ



వానపల్లిపాలెంలో నిత్యావసర వస్తువులను అందిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్, ఎంపీ చింతా అనురాధ సహకారంతో నిత్యావసర సరుకులను అందజేశారు. మండలంలోని వానపల్లి పాలెం పంచాయతీ పరిధి బీవీఆర్ నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైన జొన్నాడ వీరాస్వామి కుటుంబానికి గురువారం సరుకులను అందజేసి, ఆర్థిక సాయం అందజేశారు. నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, ముత్తాబత్తుల వజ్రం, నల్లా శ్రీను, పూతిక దుర్గారావు పాల్గొన్నారు.

### గెలుపోటములు సహజం

అంబాజీపేట: ప్రతి క్రీడాకారుడూ గెలుపోటములను సమానంగా స్వీకరిస్తేనే భవిష్యత్తులో రాణిస్తారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మాచవరంలో ఐదు రోజులుగా జరుగుతున్న అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. విన్నర్‌గా కుసుమవారిపేట, రన్నర్స్‌గా ఎస్వీ కాలనీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కుసుమ సంతోష్ నిలిచారు. విజేతలకు షీల్డ్‌లు, నగదును సర్పంచ్ శాంతకుమారి, సుబ్బారావు దంపతులు అందజేశారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ 33/11కేవీ నందు విద్యుత్ తీగల మరమ్మత్తులు, చెట్టు కొమ్మల తొలగింపు వంటి పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.